# గోదారమ్మ-20

"నిజం చెప్పాలంటే, నాకు అప్పటిదాకా నా పెంపకం మీద చాలా గర్వంగా ఉండేది…నేను పిల్లల్ని క్రమశిక్షణ తో కాకుండా స్నేహితుల్లా పెంచాను. మంచి-చెడూ తెలుసుకోగలిగే విచక్షణా నేర్పించాననే అనుకున్నాను. కానీ ప్రేమ-పెళ్ళి మీద ఇలాంటి అభిప్రాయాలు నా కొడుకు చెబుతాడని నేను ఊహించలేదు. నచ్చిన అమ్మాయితో ప్రేమా….అంతస్తుకి తగిన అమ్మాయితో పెళ్ళీనా..? ఇవా నేను నేర్పించానని అనుకుంటున్న విలువలు ? నాకు సిగ్గుతో తల కొట్టేసినట్టైంది. నా అభిప్రాయం నిర్మొహమాటంగా వాడితో చెప్పాను.

'ఆస్తుల కన్నా విలువలు చాలా ముఖ్యం. అవే మనతో చివరి వరకూ ఉండేవి. అంతస్తు అనేది మేం ఇచ్చేదేగదా…ఇపుడు నేను చెబుతున్నాను. ఇష్టపడిన అమ్మాయితోనే పెళ్ళి జరగాలనేది నా అభిప్రాయం. నిజానికి ప్రేమించింది నువ్వు, నన్ను ఒప్పించాల్సిందీ నువ్వు…కానీ నేనే నిన్ను ఒప్పించాల్సొస్తుంది, విడ్డూరంగా. ప్రేమకి అడ్డం రాని అంతస్తు… పెళ్ళికి మాత్రం నీకు గుర్తురావటం విచిత్రంగా ఉంది.' అంటూ నా అభిప్రాయం ఖచ్చితంగా చెప్పేసాను. నా నిర్ణయానికి వాడు తలవంచక తప్పలేదు.

కానీ, నా అభిప్రాయానికి ఆశ్చర్యం ప్రకటించింది పెద్ద కోడలు. నేను ఈ మాట చెప్పినపుడు ముందు విస్తుపోయి…. తర్వత ఖచ్చితమేనని తెలిసాక తన అభ్యంతరం గురించి చెప్పింది.

'వంటావిడ కూతురు నాకు తోడికోడలుగా ఈ ఇంట్లో ఉండటానికి మీరు ఒప్పుకున్నా నాకు మాత్రం సమ్మతం కాదు. అయినా మీరు తప్పదంటున్నారు కాబట్టి, అందర్నీ పిలిచి ఘనంగా కాకుండా ఏ గుడిలోనో పెళ్ళి జరిపించి, వాళ్ళని మరోచోటకి పంపెయ్యండి. మీ అబ్బాయి ఎలాగూ ఇంకోవూరులో ఈ వ్యాపారానికి బ్రాంచి తెరవాలని అనుకుంటున్నారుగా… అది అప్పగించేసి పంపేద్దాం…!' అంది.

అది అందరికీ సమ్మతంగానే అనిపించటంతో నేనూ ఏమీ మాట్లాడలేదు. వాళ్ళిద్దరి పెళ్ళీ అలా జరిగి, ఇద్దరూ వేరే వూర్లో కాపురం పెట్టి వెళ్ళిపోయాక సావిత్రి నాకు మరీ మరీ కృతజ్ఞతలు చెప్పి వాళ్ళ వూరు వెళ్ళిపోయింది.

ఇక అపుడు… పెద్దకోడలు ఇంటి పెత్తనం మొత్తం తన చేతుల్లోకి తీసుకుంది. వంటకి, పైపనులకీ తనకి నచ్చిన వాళ్ళని ఏర్పాటు చేసుకుంది. నా ప్రమేయం దేనిలోనూ ఉండకూడదన్నట్లుగా తన ప్రవర్తన ద్వారా నాకు తెలియజేసింది! నాలోనూ ఒక విధమైన నిర్లిప్తత ఏర్పడి అన్ని విషయాల పట్ల ఆసక్తి సన్నగిల్లటంతో నిరాసక్తంగా ఉండిపోయాను.

ఇల్లంతా తన ఇష్టప్రకారమే మార్పులూ, చేర్పులూ చేసింది. దానికీ నాకేం అభ్యంతరం లేకపోయింది కానీ….నాపట్ల తను ప్రవర్తించే విధానం నాకు నచ్చలేదు. పైన మేడమీద ఒక గదిలో నా మకాం ఏర్పాటు చేసింది. ఆ ఇంట్లో నా

అవసరం లేదని పదే పదే అనిపించటం మొదలయ్యింది. మన ఇంట్లోనే మనకి పని లేనట్టు అనిపించటం ఒక చిత్రమైన ఎవరికీ రాకూడని అనుభూతి ! అలాంటి అభిప్రాయం నాకు రావటమే నా పెద్ద కోడలికీ కావల్సింది. పెద్దవాళ్ళకి అలాంటి అభిప్రాయం తెప్పించటానికి ఎవరైనా పెద్ద కష్ట పడక్కరలేదనుకుంటా...ఆ వయసులో వాళ్ళ ఉనికి అవసరం లేనట్టు ప్రవర్తిస్తే చాలు ! అదే నా అనుభవం లోకి వచ్చేట్టు తెలివిగా చేసింది నా పెద్ద కోడలు. కానీ కోడలి ఆధిపత్యాన్ని అంగీకరించటానికి నాకు చిన్నతనం ఏం లేదు. అందుకే, నేను విశ్రాంతిగా కూర్చుని... ఆమె చెప్పినట్లుగా నడుచుకోవటమే ఉత్తమం అనిపించింది.

ప్రతిరోజు, నా గది పక్కనున్న బాల్కనీలో నిలబడి ఉదయం పూట క్రింద రోడ్డుమీద వచ్చిపోయేవాళ్ళని చూడటం నాకో ఇష్టమైన అలవాటు. ఆరోజు మా కోడలు వచ్చి 'ఏం చూస్తున్నా'రని అడిగింది. అదే తడువుగా నేను నా ఇష్టాన్ని, ఆలోచనలను తన ముందు మనసువిప్పి చెప్పాను.

'చిన్న పిల్లలు తల్లిదండ్రులిద్దరిలో ఎవరిదో చేయి పట్టుకుని కొందరు, స్కూటరు వెనక కూర్చుని కొందరు బడికి వెళ్తోంటే... వాళ్ళ హుషారునీ, ముద్దు మాటల్లోని మురిపాన్ని చూడటం బావుంటుంది కదూ...

అలాగే కొందరు ఇల్లాళ్ళు ఇరుగు పొరుగులతో కలిసి కాటోలు, సంచీలు పట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ కూరగాయల మార్కెట్ కు వెళ్తూనో, వస్తూనో ఉంటే చూడటమూ నాకలాగే బావుంటుంది.

ఒకప్పుడు మా పిల్లల చిన్నతనంలో నేనూ నడిచి వెళ్ళి ... కావలసినవన్నీ కొని తెచ్చుకునే దాన్ని! ఆ రోజులు ఎంత బావుండేవో...' అంటూ నిట్టూర్చాను.

నా కోడలు వ్యంగ్యంగా నవ్వింది. ''కూరగాయల బరువుతో కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా నడుస్తున్నపుడు కార్లలో రివ్వున దూసుకుపోయేవాళ్ళని చూసి 'అయ్యో... అలా వుంటే ఎంత బావుంటుంది!' అనిపించలేదా?''

ఆ మాటలూ నాకు నిజమేననిపించాయి.

అవునంటూ అంగీకరిస్తున్నట్లుగా నేను అసంకల్పితంగా అన్నాను.. ''నువ్వన్నదీ నిజమేలే... మనకు లేనిదానిపైనే మక్కువ ఉంటుంది.''

అంతే, మా కోడలికి బుస్సున కోపం వచ్చింది. 'అంటే, మీ ఉద్దేశ్యం...మీలా నేను డబ్బులో పెరగలేదనా..? కార్లలో తిరగలేదనా ?? మీలా కాదు నేను, డబ్బులోనే పుట్టాను..డబ్బులోనే పెరిగాను. అప్పట్లో మధ్య తరగతి జీవితంతో కష్టపడ్డారని...మీ కాలు కదపకుండా అన్నీ అమరుస్తూంటే..మీకు ఇలానే వుంటుంది. ఇపుడు కూరగాయలు కావల్సివస్తే, మనమే వెళ్ళి తెచ్చుకోనక్కర్లేదు... ఒక ఫోన్ చేస్తేనో, డ్రైవరుకు ఆ పని చెబితేనో, కాలు మనం కదపనక్కర్లేకుండా నిముషాల మీద కాళ్ళ దగ్గరకే అన్నీ వచ్చేస్తాయి! ఆ స్థితికి వచ్చినందుకు సంతోషించండి.

స్థితిగతులను అనుభవించాలన్నా అదృష్టం ఉండాలి ! అంతేగానీ మళ్ళీ మధ్యతరగతి జీవితమే బావుందనుకోవటం...అవివేకం . నా దృష్టిలో అది చేతకానితనం మాత్రమే' అంటూ హితోపదేశం చేసింది.

నేను మారు మాట్లాడలేదు. నాకు మాత్రం ఎందుకోగానీ ఇపుడున్న అష్టయిశ్వర్యాల కన్నా కూడా, అపుడు ఆయన ఉద్యోగం చేస్తుండగా గడిపిన మధ్యతరగతి జీవితమే బావుండేదన్నట్లుగా ఉంటుంది!

కారణం... నేను నిరాడంబర జీవితానికి అలవాటు పడినందువలనే అయి వుండొచ్చు... లేదా మా కోడలన్నట్టు చేతకానితనాన్ని సమర్ధించుకోవటం అనొచ్చు.

నేను చిన్నతనం నుండీ, దేనికీ లోటులేని రాజకీయ నేపథ్యం ఉన్న నాయకుడి ఇంట పుట్టి నిరాడంబరంగా పెరిగినా, సంపన్నుల ఉమ్మడి కుటుంబానికి కోడలినయ్యాను. ఎంత మంది పాలికాపులన్నా రోజంతా ఏదోపని ఉంటూనే ఉండేది. కుటుంబ సభ్యులందరికీ కావలిసినవి నేనే స్వయంగా ఏర్పరచటం, పనివాళ్ళను స్వయంగా అజమాయిషీ చేసుకోవటం నిజానికి ఇవే పెద్దపనులు. అవన్నింటినీ సమర్ధించగలిగాను. పెద్దవాళ్ళ ప్రశంసలనూ పొందగలిగాను.

ఆస్త పంపకాల తరువాత... ఆయన ఉద్యోగం చేసినప్పటి రోజులు నాకెప్పటికీ మరపురానివే. అన్ని పనులనూ స్వంతంగా చేసుకుంటూ డబ్బును పొదుపుగా వాడుకోవటం, పొదుపుచేసిన డబ్బును చూసి ఏదో సాధించినట్లుగా ఆనందపడటం, పిల్లల ఇష్టాలకు ఆ డబ్బును ఖర్చు చేయగలిగినపుడు కలిగే సంతృప్తి, ఆనందం... ఇంత ఆస్తిపాస్తులు, ఇపుడున్నాగానీ ఆ అనుభూతి మాత్రం అనుభవంలోకి రాదే!

ఈ మాటలు నా కోడలికి చెబితే పగలబడి నవ్వుతుందని తెలుసు. మరి తను నాలా కాకుండా సంపన్నుల ఇంట అపురూపంగా పెరిగిన అమ్మాయి కదా! నాకు కోడలి మీద వ్యతిరేకత ఎంతమాత్రమూ లేదు. మా అబ్బాయిని గౌరవిస్తూ, వాడితో ప్రేమగా వుంటే చాలు అనే అనుకునేదాన్ని.అయితే నన్ను చులకన చేయటాన్ని మాత్రం భరించలేకపోయాను. తనతో అన్నింటిలోనూ నాకు వ్యతిరేకతే కనిపిస్తోంది. అన్ని విషయాల పట్ల విరుద్ధ దృక్పథాలతో ఉన్న ఇద్దరం ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నాం. తన అధికారాన్ని అంగీకరించటమే నాపట్ల తనకి ఉదాసీనత ఏర్పడటానికి కారణమా...? నాకు అర్థం కాలేదు.

తరచూ కోడలి భావాలు విన్నప్పుడు రెండో వాడు ఎలా వున్నాడో అనిపించేది. అసలే నా బలవంతం మీద అంజనాని పెళ్ళి చేసుకోవటం జరిగింది కాబట్టి, తనతో సవ్యంగా ఉండడేమోననే అనుమానం వేధిస్తూ ఉండేది. పెద్దబ్బాయి పట్ల మాత్రం నాకు బాగా నమ్మకం ఉంది. వాడెప్పుడూ నిస్వార్థంగా కుటుంబం గురించే ఆలోచిస్తాడు, అని నాకు తెలుసు. అందుకే నిశ్చింతగా వ్యాపారం, ఆర్థిక లావాదేవీలూ...లాభ నష్టాలూ అన్ని భాద్యతలూ వాడికే అప్పగించేసాను. తమ్ముడికేమాత్రం అన్యాయం చేయడని నాకు తెలుసు.

రెండో అబ్బాయికే నేను గట్టిగా హెచ్చరించదలుచుకున్నాను. ఆస్తిపాస్తుల్లో భాగం ఉండదేమోననే భయంతోనో, నా మీద గౌరవంతోనో...అంజనా మీద నిజంగా ఉన్న ప్రేమతోనో, మరొకటోగాని పెళ్ళికి ఒప్పుకున్నాడు కదా... అందుకని వాడి సంసారం మీద ఎక్కువ బెంగంగా ఉండేది. కానీ వాళ్ళతో ఫోనులో మాట్లాడినపుడు ఇద్దరూ బాగానే ఉంటున్నారని తెలుసుకోగలిగాను. నాకు కొంతవరకూ ఆ విషయం సంతృప్తి కలిగించింది.

అందుకే నా ఆలోచనలన్నీ తెలియజేస్తూమా రెండో అబ్బాయికి ఒక ఉత్తరం రాసాను. అవి ఎవరికైనా ఉపయోగపడేవే అని ఇపుడు నీకూ చెబుతున్నాను. సీతా, అదేమిటంటే...'డబ్బును చిన్నచూపు చూడకూడదు. అలాగని మరీ ఎక్కువ విలువా ఇవ్వకూడదు, మనుష్యుల్ని మనుష్యులుగా మాత్రమే చూడాలి. కానీ మంచితనం, సంస్కారం, పరోపకారం లాంటి విలువలున్న వాళ్ళని ప్రత్యేక అర్హతలు ఉన్నవాళ్ళగా భావించి గౌరవించాలి! మనం ప్రేమించేవాళ్ళకన్నా...మనల్ని ప్రేమించేవాళ్ళతో జీవితం ఎంతో బావుంటుంది. అది ఈ పాటికే నీకర్థం అయ్యివుంటుంది. కింద స్థాయి నుంచి పైకి వచ్చిన వాళ్ళకి జీవితం మీద చాలా స్పష్టమైన అవగాహన వుంటుంది. మన మనసెరిగి నడుచుకునేవాళ్ళతో జీవితం ఎన్నో ఆస్తిపాస్తుల కన్నా విలువైనది' అని వివరిస్తూ నా భావాలు వాడితో పంచుకున్నాను.

వెంటనే, వాడూ నాకొక ఉత్తరం రాసాడు. అందులోని కొన్ని విషయాలు నీకూ చెబుతాను. ''అమ్మా... చిన్నప్పటినుంచీ మమ్మల్నిద్దర్నీ, ఎంతో ఓపికగా స్నేహితురాలిలా మెసలుతూ పెంచావు. అన్నయ్యతో నాకున్న గాఢమైన అనుబంధం వెనుక నీ పాత్ర, కృషి చాలా ఎక్కువ అని నాకు తెలుసు. తల్లితండ్రులద్వారా సంక్రమించే ఆస్తి, అంతస్థుల కంటే, స్వయంకృషితో సాధించేదే ఎక్కువ సంతృప్తినిస్తుందని నీ పెంపకంలో నేను తెలుసుకోగలిగాను. అన్నయ్య ఇస్తున్న ప్రోత్సాహంతో నిలదొక్కుకోవటానికి ప్రయత్నిస్తున్నాం.. ఒక్కొక్క మెట్టూ పట్టుదలతో ఎక్కగలగటం చాలా బావుందమ్మా. ఎప్పటికైనా, ఉన్నత స్థానాన్ని సాధించగలమనే ఆశ చాలా బలాన్నిస్తోంది!

ఈ సందర్భంలో నీకు కొన్ని విషయాలు చెప్పాలి. వదిన తమ్ముడు కుమార్, అంజనాని వలలో వేసుకోవాలని ప్రయత్నించటం నేనూ గమనించాను. ఒకసారి అంజనా చూచాయిగా కావాలనే 'ప్రేమ మీద తనకు సదభిప్రాయం లేదని, పెళ్ళి తర్వాత కలిగే ప్రేమనే నమ్ముతానని' గట్టిగా చెప్పటంతో ఇక కుమార్ మొహం చాటు చేయటం మొదలు పెట్టాడని అంజనా నాతో చెప్పింది. 'చూసారా...మనుష్యుల అసల రంగులు ఎలా బయటపడతాయో..' అని నవ్వుతూ అంది. ఆ క్షణంలో అంజనా మానసికి సౌందర్యానికి నేనూ ముగ్ధుడినయ్యాను. ఆ తర్వాత మేమిద్దరం మంచి స్నేహితులమయ్యాం. కానీ మేమిద్దరం ఒకరినొకరు మనసులోనే ఆరాధిస్తూ ఉన్నామే తప్ప పరిధిలు ఎప్పుడూ దాటలేదు. ఇది ఎలా గ్రహించాడో తెలియదుగానీ, కుమార్ అక్కసుతో వదినకీ, అంజనా వాళ్ళ అమ్మగారికీ, మా స్నేహాన్ని వక్రీకరించి చెప్పి, మమ్మల్ని దూరం చెయ్యాలనుకున్నాడు. కానీ నాకు నీ వ్యక్తిత్వం

గురించి తెలుసుగా, ఆస్తులకన్నా మనుష్యులకీ, మనస్తత్వాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తావని ఎప్పటిలానే రుజువు చేసావు. అంజనా అందమైనదే కాదు... చాలా తెలివైనదికూడా! తనూ కేవలం ఇంటిపనులకే అంకితమవకుండా నాకు వ్యాపార సంబంధమైన విషయాలలోనూ తోడుగా ఉండి సహకారాన్ని అందిస్తోంది! అవునమ్మా...మనల్ని ప్రేమించే వాళ్ళతో జీవితం చాలా బావుంటుందమ్మా. ఆ ఆనందాన్ని నేను అనుభవిస్తున్నాను. ''

ఇలా సాగిన ఆ ఉత్తరాన్ని చదివినపుడు నాకు చాలా ఆనందం కలిగింది.

నేను చాలా సంతోషంగా ఈ విషయాన్ని పెద్దకోడలితో పంచుకుంటే, దానికి తను వ్యంగ్యంగా నవ్వి ''మీ చిన్న కొడుకు చేసిన నిర్వాకానికి నాకు పరువు పోయినట్టైంది. మీరు మురిసిపోతున్నారు కాబోలు . మా తమ్ముడు తెలివిగా, ఈ తద్దినాన్ని వద్దనుకుంటే... మీ తెలివి తక్కువ అబ్బాయి తగిలించుకున్నాడు. ముందుగా అంజనా, మా వాడికే వల విసిరింది. మావాడు అంగీకరించకబోయేసరికి కోపంతో దుర్భాషలాడిందట! దాంతో వాడికి తిక్కరేగి దిక్కున్న చోట చెప్పుకోమని ఛీత్కరించేసరికి వాళ్ళిద్దరూ వూరుకు వెళ్ళిపోవటానికి సిద్ధపడ్డారు! కానీ మీరు మధ్యలో దూరి మా తమ్ముడికి బుద్ధి చెప్పమంటే.. 'మీ చిన్నబ్బాయీ ఉన్నాడుగా... తనకే చెప్పండీ' అని నేను మీతో అన్నా. మీ అబ్బాయి మీద పెడితే, మీరేదో తెలివిగా, వాళ్ళకేదో ముట్టచెప్పి, ఊరికి పంపించేస్తారని అనుకుంటే... తెలివితక్కువగా మీ అబ్బాయి కే ఆ పేదింటి పిల్లను కట్టబెట్టారు...!'' అంటూ తన చేసిన ఘనకార్యాన్ని తెలివైన పనిగా సమర్థించుకుంటూ మాట్లాడటం చూసి నేను నిర్విణ్ణురాలినయ్యాను.

చేసిన తప్పు ఒప్పుకోకుండా తప్పించుకోవటం గొప్పింటి బిడ్డల తెలివైన లక్షణంగా కోడలు భావించటం నాకు కంపరం కలిగించింది! కానీ నా చిన్నకొడుకు అంజనాకు అండగా నిలబడాలనుకోవటం వాడి గొప్ప మనసుకు నిదర్శనంగా నాకనిపిస్తే, అదే నా కోడలికి తెలివి తక్కువగా అనిపిస్తోంది! నేను మాత్రం నా పెంపకంలో లోపం లేదని వూరట చెందాను.

సీతా.... క్రిందటసారి నేను నా కథ... అదే నా గురించి చెప్పేటపుడు ఒక విచిత్రం జరిగిందని చెప్పానా... అదేమిటంటే... అకస్మాత్తుగా ఎవరో ఒకతను వచ్చి... 'మా నాన్నగారు మీ దగ్గర్నుండి అప్పుగా తీసుకున్న డబ్బు మీకు అందజేయమని చెప్పారు' అంటూ...... అంతకుముందు మా దగ్గర పనిచేసే పరంధామయ్య గారు బ్యాంకు నుండి తీసుకుని వెళ్ళిపోయిన డబ్బు మొత్తాన్ని, మా పెద్దఅబ్బాయికి ఇచ్చి చకచకా వెళ్ళిపోయాడట! 'ఇలాంటి వాళ్ళుంటారా' అనే ఆశ్చర్యం నుండి మావాడు తేరుకుని 'ఎవరూ, ఏమిటీ' అంటూ ఆ అబ్బాయి పేరు అడుగుదామనుకునే లోపునే, వివరాలేం చెప్పకుండా అతను వెళ్ళిపోవటం జరిగిందట! మావాడు నిర్ఘాంతపోతూ నాతో ఇదంతా చెప్పి, అప్పట్లో పరంధామయ్య గారు డబ్బుతో కనపడకుండా వెళ్ళిపోతే, నా నగలు అమ్మే ఆ విపత్తు నుండి బయటపడ్డాం, కాబట్టి ఇప్పుడు వాళ్ళ అబ్బాయి తిరిగి ఇచ్చిన మొత్తం నాకే చెందుతుంది అని అంటూ ఆ డబ్బు అంతా నాకే ఇచ్చెయ్యబోయాడు.

నేను ఆ మాటని తిరస్కరించాను. 'నేనేం చేసుకుంటాను, నువ్వు ఏదోలా మన వ్యాపారంలోనే పెట్టి వృద్ధిచేయి' అని చెప్పాను.

'అంతా కాకపోయినా, కొంతయినా తీసుకుని, మీ వాళ్ళిచ్చిన నగలకు గుర్తుగా కొన్ని నగలు అయినా కొనుక్కోవచ్చుగా అమ్మా' అన్నాడు.

ఇంక తప్పక, నేను కొంత డబ్బు తీసుకుని నా బ్యాగులో అడుగున సర్దుకున్నాను.. 'ఈ డబ్బుతో నేను నగలే కొనుక్కుంటానో, వేరే విధంగా ఖర్చుపెట్టుకుంటానో మాత్రం నీకు అనవసరం' అని చెప్పాను. సరేనని మా అబ్బాయి నవ్వి వూరుకున్నాడు.

అప్పుడే నాలో ఒక ఆలోచన మొదలైంది...ఎప్పటినుం మొదలైన మనసులోని సంఘర్షణ కు ఒక రూపం ఇవ్వదల్చుకున్నాను.